సీసీ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలి: కార్పొరేటర్



రెడ్డికాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

చంపాపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని రెడ్డికాలనీలో జీహెచ్ఎంసీ నిధులు రూ.15లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని ఆయా కాలనీలు, బస్తీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన వెంటనే డివిజన్‌కు కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, డేరంగుల కృష్ణ, కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



వరదనీటి కాల్వ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

మోహన్‌నగర్ వరదనీటి సమస్యలు పరిష్కారం

కొత్తపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులతో మోహన్‌నగర్ వరదనీటి సమస్యలు పరిష్కారమవుతాయని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. రూ.48 లక్షల వ్యయంతో మోహన్‌నగర్‌లో స్టార్మ్ వాటర్ డ్రైన్, సీసీ రోడ్డు పనులు చేపడుతున్నారు. సోమవారం కాలనీలో జరుగుతున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలని, కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరద నీటి కాల్వ పనులు పూర్తయిన తర్వాత సీసీ రోడ్డు పనులు చేపడతారన్నారు. పనుల్లో సాంకేతికంగా లోపాలు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని, తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈ షరీఫ్, కాలనీ ప్రతినిధులు రామిరెడ్డి, రాజశేఖర్, ప్రసాద్, మురళీకృష్ణ, వినోద్ పాల్గొన్నారు.

హరిహర క్షేత్ర బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కొత్తపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సత్యానగర్‌లో వెలసిన హరిహర క్షేత్ర 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకస్వాములు శాస్త్రోక్తంగా వేదమంత్రాల మధ్య తొలుత ఆలయ ప్రదక్షిణ, గోపూజ, గణపతిపూజ తదితర బ్రహ్మోత్సవ ఆరంభ విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో సత్యానగర్‌కాలనీ సంక్షేమ సంఘం, హరిహర క్షేత్ర దేవస్థాన కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



ఏఐటీయూసీ ర్యాలీని ప్రారంభిస్తున్న యాదిరెడ్డి తదితరులు

మహాసభలకు తరలిన భవన నిర్మాణ కార్మికులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ప్రారంభమైన భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం నుంచి భవన నిర్మాణ కార్మికులు భారీగా తరలివెళ్లారు. కుంట్లూర్ ఆర్ఎన్ఆర్‌కాలనీ ఫేజ్-3లో సోమవారం సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి ఏఐటీయూసీ జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. భారీ సంఖ్యలో కార్మికులు మహాసభలకు తరలినట్లు యాదిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బతి లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, కేతరాజు నర్సింహ, రాములు, పాండు, బిచ్చునాయక్, క్రాంతి, రవళి పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మండల నూతన కార్యవర్గం

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ప్రణయ్, కార్యదర్శిగా ఫారుక్‌పాష, ఉపాధ్యక్షుడిగా హరీష్, సహాయ కార్యదర్శిగా రిత్విక్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ మాట్లాడుతూ నూతన కమిటీ విద్యార్థుల సమస్యలపై పోరాటం చేయాలన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. అదేవిధంగా విద్యాశాఖకు మంత్రిని నియమించాలన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

సర్వే నంబర్ 23ను రికార్డుల్లో ప్లాట్లుగా నమోదు చేయాలి

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఓఆర్‌సీ సర్టిఫికెట్‌తో 32 ఏళ్ల క్రితం చేసిన లేఅవుట్‌ను ఇప్పుడు కొందరు వ్యక్తులు చెడిపేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని శ్రీ ధర్మ సాయినగర్ అసోసియేషన్ ప్లాట్ల యజమానులు సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. మండలంలోని లష్కర్‌గూడ సర్వే నంబర్ 23లోని 2.28 గుంటల స్థలానికి ఓఆర్‌సీ సర్టిఫికెట్ తీసుకుని 1992లో రియల్ ఎస్టేట్ వ్యాపారి లేఅవుట్ చేసి ప్లాట్లను విక్రయించారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆ భూమి తమ తాతలకు సంబంధించినది అంటూ లేఅవుట్‌లోని ప్లాట్ల హద్దులను తొలగిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. గతంలో ఇలా చేసిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టామని తెలిపారు. ప్రస్తుతం ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ కూడా చెల్లించామని పలువురు ఇళ్లను కూడా నిర్మించుకున్నట్లు పేర్కొన్నారు. సదరు సర్వే నంబర్‌ను రికార్డుల్లో ప్లాట్లుగా నమోదు చేయాలని ప్లాట్ల యజమానులు కోరారు.

నిరుపేద యువతి వివాహానికి 'ఉప్పల' చేయూత

మన్సూరాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తండ్రిలేని నిరుపేద కుటుంబానికి చెందిన యువతి వివాహానికి ఉప్పల ఫౌండేషన్ అండగా నిలిచింది. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అందె గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన దోమల విజయ, స్వర్గస్తులు భుమేష్ దంపతుల కుమార్తె మౌనికకు వివాహం నిశ్చయమైంది. కాగా విషయం తెలుసుకున్న ఉప్పల ఫౌండేషన్ వ్యవస్థాపకులు, టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సోమవారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆ యువతికి పుస్తెమెట్టెలు, చీరగాజులను అందజేశారు. కార్యక్రమంలో వేముగంటి మురళి, శ్రీధర్, యాదయ్య, నర్సింహులు, సత్యం, శంకర్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపించకుండా పూర్తి చేయండి

మన్సూరాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల్లో ఏ మాత్రం నాణ్యత లోపించకుండా పనులు చేపడుతూ వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. డివిజన్ పరిధిలోని ఆర్టీఓ కార్యాలయం నుంచి లక్కీ రెస్టారెంట్ వరకు చేపడుతున్న బాక్స్‌డ్రైన్ పనులను, అదేవిధంగా ఆప్కోకాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను సోమవారం అధికారులు, స్థానికులతో కలిసి సురేందర్‌యాదవ్ పరిశీలించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఈఈ రమేష్‌బాబు, డీఈ కనకయ్య, ఈఈ దీపక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించండి

- చందచెరువు వద్ద పబ్లిక్ టాయ్‌లెట్స్ నిర్మించండి
- వీధి వ్యాపారుల షాపులను వేలం వేయండి
- మీర్‌పేట్ మునిసిపల్ అధికారులకు ఎమ్మెల్యే సబితారెడ్డి ఆదేశం

సరూర్‌నగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని మూడు చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క ఆకును తొలగించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి మునిసిపల్ అధికారులను ఆదేశించారు. సుందరీకరణలో భాగంగా చందచెరువు వద్ద పబ్లిక్ టాయ్‌లెట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుత వేసవి సీజన్‌తో పాటు రానున్న వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని పలు అంశాలపై సోమవారం జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో ఆమె మునిసిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు జలమండలి అధికారులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. అన్ని ప్రాంతాలకు అవసరమైన పరిమాణంలో నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. ఇక రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీలు, నాలాలు బ్లాక్ కాకుండా చూడాలని, వాటిలో చెత్తాచెదారం పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. జిల్లెలగూడ చందచెరువు వద్దకు వచ్చే సందర్శకులు, వాకర్స్ అవసరార్థం పబ్లిక్ టాయ్‌లెట్స్ నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని సబితారెడ్డి సూచించారు. దోమల బెడద, దుర్వాసన వ్యాపించకుండా మూడు చెరువుల్లోని గుర్రపుడెక్క ఆకును తొలగింపజేయాలని పేర్కొన్నారు.

బాలాపూర్ చౌరస్తాలోని లేబర్ అడ్డాను తరలించండి

ప్రస్తుతం బాలాపూర్ చౌరస్తాలో ఉన్న లేబర్ అడ్డాను ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా వెంటనే అక్కడి నుంచి మంత్రాలచెరువు ఎగువన నిర్మించిన వీధి వ్యాపారుల దుకాణముల సముదాయం వద్దకు తరలించాలని ఎమ్మెల్యే సబితారెడ్డి మునిసిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు సూచించారు. అదేవిధంగా లెనిన్‌నగర్‌లోని రైతుబజార్ పక్కన నిర్మించిన వీధి వ్యాపారుల దుకాణములను వేలం ద్వారా లబ్ధిదారులకు(వ్యాపారులకు) కేటాయించాలని సూచించారు.



మీర్‌పేట్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

రోడ్లకు ప్యాచ్ వర్క్ చేయండి

కార్పొరేషన్ పరిధిలోని అనేక రోడ్లు గుంతలమయంగా మారినట్లు ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారని, ఎక్కడెక్కడ రోడ్లు దెబ్బతిన్నాయో గుర్తించి వాటికి మరమ్మతులు(ప్యాచ్ వర్క్) చేపట్టాలని సబితారెడ్డి అధికారులకు సూచించారు. రోడ్లపై గుంతల కారణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తి, వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నదని ఆమె అన్నారు. ఆయా అంశాలపై సత్వర చర్యలు చేపట్టాలని ఆమె అధికారులకు స్పష్టం చేశారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి



ఆర్‌బీఐకాలనీ(నార్త్)వాసులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్

కొత్తపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిర్మాణం చేపట్టడంతో పాటు ఆ భవనంలో ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ప్రేయర్ హౌస్ నిర్వహణకు ఏర్పాట్లు చేయడంపై చర్యలు తీసుకోవాలంటూ కొత్తపేట ఆర్‌బీఐ కాలనీ(నార్త్)వాసులు, కార్పొరేటర్ పవన్‌కుమార్‌తో కలిసి సోమవారం జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జెడ్సీకి ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఆర్‌బీఐకాలనీ(నార్త్)లోని ప్లాట్ నెం.23, 24ల యజమాని ఎల్.ప్రశాంత్‌కుమార్ సదరు ప్లాట్లలో భవన నిర్మాణం చేపట్టి ప్రేయర్ హౌస్/చర్చి కోసం వినియోగించే యోచనను వ్యక్తం చేశారు. కాలనీవాసులు అందుకు అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం భవనాన్ని నివాసితులకు మాత్రమే వినియోగించాలని కాలనీ సంక్షేమ సంఘం వారు ఆయనకు తెలిపారు. అనంతరం 2024 ఏప్రిల్ 16న ప్రశాంత్‌కుమార్ తన స్థలంలో భవనాన్ని రెసిడెన్షియల్ పర్పస్ కోసం వినియోగిస్తానని ప్రేయర్ హౌస్/చర్చి కోసం వినియోగించనని కాలనీ సంక్షేమ సంఘం వారికి రాత పూర్వకంగా ఒప్పంద పత్రం అందజేశారు. అనంతరం ఈనెల 17న సదరు భవనంలో ప్రేయర్ హౌస్ నిర్వహణ ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలియడంతో కాలనీవాసులు అదేరోజు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ నిబంధనలను ఉల్లంఘిస్తూ సదరు భవనాన్ని ప్రేయర్ హాల్‌గా మార్చేయడం సబబు కాదని కాలనీవాసులు అభిప్రాయపడ్డారు. ఈ మతపరమైన వ్యవహారంతో కాలనీలో శాంతియుత వాతావరణం దెబ్బతినే ప్రమాదం ఉందని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కార్పొరేటర్ పవన్‌కుమార్‌లు జెడ్సీ హేమంత్ పాటిల్‌కు విన్నవించారు. తాను అందజేసిన ఒప్పందాన్ని తానే ప్రశాంత్‌కుమార్ ఉల్లంఘించారని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేకంగా అక్రమంగా భవనం నిర్మించడంతో పాటు జీహెచ్ఎంసీ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రేయర్ హౌస్ నిర్వహించాలని నిర్ణయించడం కాలనీవాసులందరికీ అభ్యంతరకరమని వారు జెడ్సీకి వివరించారు. మతపరమైన వ్యవహారం కావడంతో వారు ఆందోళన వ్యక్తం చేశారు. చట్టవ్యతిరేకంగా ప్రేయర్‌హౌస్ నిర్వహించడాన్ని అనుమతించవద్దని, భవనాన్ని రెసిడెన్షియల్ పర్పస్‌కు మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కుకింగ్ గ్యాస్ ఏజెన్సీపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు



గ్యాస్ ఏజెన్సీపై ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

మన్సూరాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కార్మికులకు జీతాలు ఇవ్వకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్న శ్రీషిరిడీసాయి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలంటూ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు నకిరేకంటి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ సభ్యులు, కార్మికులతో కలిసి సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ వనస్థలిపురంలోని శ్రీషిరిడీసాయి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వారు పదేళ్లుగా కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని, ఇవ్వాలని అడిగితే ఉద్యోగం నుంచి తొలగిస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజకీయ నాయకులు, అధికారుల అండదండలతో సదరు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు ధన్‌రాజ్‌గౌడ్ కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్నాడని, వెంటనే ఆ ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా పదేళ్లుగా ఈ వైఖరిపై అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించకపోవడంపై శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా మండిపడ్డారు. ఫిర్యాదు చేసిన వారిలో యూనియన్ ఉపాధ్యక్షుడు రమేష్, సంయుక్త కార్యదర్శి నర్సింగ్, కార్యదర్శి అశోక్, కార్మికులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని తట్టిఅన్నారం మాజీ ఎంపీటీసీ నల్ల ప్రభాకర్ సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 73 ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని తెలిపారు. వెంటనే ఆ భూమిని సర్వేచేసి హద్దులను ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు పట్టించుకోకపోతే కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉన్నదని తెలిపారు.

ఘనంగా 'టీ' దినోత్సవం

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ టీ(చాయ్) దినోత్సవాన్ని రూపాయి ఫౌండేషన్ చైర్మన్ జి.అనిల్‌కుమార్, మూన్ వాకర్ డ్యాన్స్ స్టూడియో నిర్వాహకుడు, డ్యాన్స్ మాస్టర్ చక్రీ జాక్సన్‌ల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డిఅన్నారం డివిజన్ కోనార్క్ థియేటర్ లేన్ లలితానగర్ మధురాపురిలో గత ముప్పై ఏళ్లుగా శివ టీ స్టాల్‌ను ఏర్పాటు చేసి వినియోగదారులకు చాయ్ అందిస్తున్న టీ స్టాల్ నిర్వాహకుడు గోశిక శివను వారు శాలువాతో ఘనంగా సన్మానించి టీ యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, చక్రీ జాక్సన్‌లతో పాటు రమణారెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

క్రీడాకారిణి కావ్యశ్రీకి చేయూత

సైదాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి క్రికెట్ టీం క్రీడాకారిణి గుగులోతు కావ్యశ్రీకి సేవ్ ద గర్ల్ చైల్డ్ సంస్థ తరఫున సోమవారం చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ రూ.70వేల విలువ గల క్రికెట్ కిట్‌ను అందజేశారు. సూర్యాపేట జిల్లాకు చెందిన గుగులోతు చీనసుజాత దంపతుల కూతురు కావ్యశ్రీ ప్రస్తుతం ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతూ క్రికెట్‌లో రాణిస్తూ జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగింది. తండ్రి తన సొంత ఖర్చులతో కూతురికి ఆసరాగా నిలబడి ఈ స్థాయికి తీసుకువచ్చాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కావ్యశ్రీకి సేవ్ ద గర్ల్ చైల్డ్ సంస్థ అండగా నిలిచింది. గతంలో అండర్-15, 19 రాష్ట్ర స్థాయిలో కెప్టెన్‌గా చేశారు.

దళితరత్న అవార్డు బహూకరణ

హయత్‌నగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ దళిత సేనా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న హయత్‌నగర్ శివగంగా కాలనీకి చెందిన తొంట బాబుకు దళితరత్న అవార్డు దక్కింది. దళిత సామాజిక వర్గానికి, యువకుల అభివృద్ధి కోసం సూచనలు, సలహాలు అందిస్తూ సామాజిక సేవా కార్యక్రమంలో పాల్గొంటు సేవ చేస్తున్నందుకు గాను బాబుకు దళితరత్న అవార్డు లభించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రవీంద్రభారతిలో ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్‌ల చేతుల మీదుగా ఈ అవార్డును బాబుకు అందజేశారు. కార్యక్రమంలో ఇటుక రాజు, వెన్నెల, పుష్పలీల, వకుళాభరణం, వినోద్, కుమారస్వామి పాల్గొన్నారు.

జిల్లాల్లో ట్రాఫిక్ అసిస్టెంట్‌లుగా ట్రాన్స్‌జెండర్స్



డైరెక్టర్ శైలజను సన్మానిస్తున్న ట్రాఫిక్ అసిస్టెంట్‌లుగా విధులు నిర్వహిస్తున్న ట్రాన్స్‌జెండర్స్

ఓల్డ్‌మలక్‌పేట ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): త్వరలోనే అన్ని జిల్లాల్లో ట్రాఫిక్ అసిస్టెంట్‌లుగా ట్రాన్స్‌జెండర్స్‌ను నియమించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని వికలాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజ అన్నారు. సోమవారం మలక్‌పేటలోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో ట్రాఫిక్ అసిస్టెంట్‌లుగా నియమించబడ్డ ట్రాన్స్‌జెండర్లు డైరెక్టర్ శైలజను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈసందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని ట్రాన్స్‌జెండర్లు సమాజంలో గౌరవంగా జీవించాలనే ఉద్దేశంతో వారికి సిటీలో ట్రాఫిక్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగ అవకాశాలు కల్పించాడన్నారు. నిబద్ధతతో పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. త్వరలోనే హైడ్రాలో కూడా ట్రాన్స్‌జెండర్ల నియామకాలు జరిగే విధంగా కమిషనరుతో మాట్లాడుతానని ఆమె తెలిపారు. విధి నిర్వహణలో మొదట కొన్ని సవాళ్లు సమస్యలు ఎదురవుతాయని వాటిని ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు. ఐడి కార్డులు, ఇతర అలవెన్సులు అందేవిధంగా ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడి విధి నిర్వహణలో అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ అరుణ, పర్యవేక్షణాధికారి అభివర్ష, టాన్స్‌జెండర్ స్టేట్ కోఆర్డినేటర్ ప్రీతి, జయంతి, సునంద పాల్గొన్నారు.

మలక్‌పేట బీ బ్లాక్ క్వార్టర్స్‌లోకి సర్కిల్-6 కార్యాలయం



బీ బ్లాక్ క్వార్టర్స్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయం

చాదర్‌ఘాట్/సైదాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట బీ బ్లాక్‌లోని బీ 3 నుంచి బీ5 క్వార్టర్స్‌లోకి జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయాన్ని తాత్కాలికంగా తరలించారు. ఇదివరకు నల్గొండ చౌరస్తాలోని దివ్యాంగుల జాతీయ ఉద్యానవనం ఆవరణలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. 2023 ఎన్నికలకు ముందు చార్మినార్‌లోని సర్దార్ మహల్‌లో ఉన్న మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయాన్ని నల్గొండ చౌరస్తాలోని దివ్యాంగుల జాతీయ ఉద్యాన వనంలోకి తాత్కాలికంగా తరలించారు. దివ్యాంగులకు చెందిన ఫెడ్ స్వచ్ఛంద సంస్థ తీవ్రంగా వ్యతిరేకిస్తూ పలుమార్లు విన్నవించారు. ఈ మేరకు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలకు కూడా విన్నవించారు. గతేడాది అక్టోబరు మాసంలో తరలించాల్సి ఉండగా పలు రకాల అడ్డంకులతో అందులోనే కొనసాగింది. చివరికి మలక్‌పేట బీ బ్లాక్ క్వార్టర్స్‌లోకి తాత్కాలికంగా తరలింది. సోమవారం నుంచి బీ బ్లాక్ క్వార్టర్స్ నుంచే మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయం కార్యకలాపాలు ప్రారంభించినట్లు సర్కిల్-6 డీసీ జయంత్ తెలిపారు. మలక్‌పేట సర్కిల్-6 పరిధిలోని ప్రజలు ఇక నుంచి మలక్‌పేట బీబ్లాక్ క్వార్టర్‌కు వచ్చి తమ సమస్యలు విన్నవించుకోవచ్చని ఆయన వివరించారు.

దళిత బిడ్డ ఆత్మహత్య కారకులను కఠినంగా శిక్షించాలి



ఎల్బీనగర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు

మన్సూరాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): దళిత కులానికి చెందిన విద్యావంతురాలు ధర్మారపు మల్లీశ్వరిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసగించడమే కాకుండా ఆమెను మానసికంగా వేధించి ఆత్మహత్యకు కారకుడైన కుక్కల జానారెడ్డితో పాటు అగ్రకులానికి చెందిన మరికొందరిని కఠినంగా శిక్షించాలని ధర్మ సమాజ్ పార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎల్బీనగర్‌లో సోమవారం పెద్ద ఎత్తున ధర్నా చేపట్టి ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల దురహంకారంతో నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం బొక్కమంతలపాడ్ గ్రామానికి చెందిన అమాయకురాలైన దళిత బిడ్డ ధర్మారపు మల్లీశ్వరి బలైపోవడం బాధాకరమని, వెంటనే ఆమె ఆత్మ శాంతించేలా కారకులైన అదే గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన కుక్కల జానారెడ్డితో పాటు పలువురిని శిక్షించడమే కాకుండా మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ధర్మ సమాజ్ పార్టీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి రాజ్‌కమల్, నల్లగొండ ఇన్‌చార్జి బరిగల దుర్గాప్రసాద్, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్లు రాఘవేంద్రముదిరాజ్, వినోద్‌యాదవ్, సేవాలాల్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్, మాదిగ జాగృతి సంఘం రాష్ట్ర కన్వీనర్ అంజయ్య, దాసోజు లలిత, జగన్, వెంకన్న, రాకేష్, సైదులు, కృష్ణ, సురేష్, మృతురాలి కుటుంబ సభ్యులు ఉన్నారు.

షెటిల్ ఆడుతూ కుప్పకూలి వ్యక్తి మృతి

సైదాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): షెటిల్ ఆడిన కొద్దిసేపటికి గుండెపోటుతో ఓ వ్యక్తి మృతిచెందాడు. సంతోష్‌నగర్‌కు చెందిన మొబైల్ షాప్ యజమాని తాజోద్దీన్(62) లక్ష్మీనగర్‌కాలనీ థీమ్ పార్కు ఆవరణలో షెటిల్ ఆడి ఇంటికి వెళ్తుండగా పార్కు గేటు వద్ద గుండెపోటుతో కుప్పకూలాడు. స్నేహితులు, కాలనీవాసులు వెంటనే 108లో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

మత్తు ఇంజెక్షన్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): లైసెన్సు లేకుండా అక్రమంగా మత్తు ఇంజెక్షన్లు విక్రయిస్తున్న వ్యక్తిని సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్‌మలక్‌పేట నివాసి యావర్ హుస్సెన్ ఎలియాస్ ఆదిల్(24) ప్రైవేటు ఉద్యోగి. మెఫెన్ టెర్మిన్ మత్తు ఇంజెక్షన్లను అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడన్న సమాచారం మేరకు సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 50 బాటిళ్ల మెఫెన్ టెర్మిన్ ఇంజెక్షన్లు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు తదుపరి విచారణ కోసం చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు యావర్ హుస్సెన్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బైకులు దొంగిలిస్తున్న పాత నేరస్థుడు అరెస్టు

- 10 బైకులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైకులతో నిందితుడు బాలరాజ్

కొత్తపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బైకులు దొంగిలిస్తూ తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్థుడిని ఎల్‌బీనగర్ డిటెక్టివ్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.7.10లక్షల విలువైన 10 బైకులు స్వాధీనం చేసుకుని, అతడిని రిమాండుకు తరలించారు. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన కార్పెంటర్ కమ్మరి బాలరాజు అలియాస్ సన్నేతుల బాలరాజ్ (50) ఎల్‌బీనగర్ మైత్రినగర్‌కాలనీలో ఉంటున్నాడు. చెడు అలవాట్లకు బానిసై సులభంగా డబ్బు సంపాయించడానికి బైకులు దొంగతనం చేయడం మొదలు పెట్టాడు. గతంలో అతడిని సరూర్‌నగర్ పోలుసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. జైలు నుంచి విడుదల అయిన తర్వాత అతడు మళ్లీ బైకులు దొంగిలిస్తున్నాడు. సోమవారం ఉదయం దొంగిలించిన బైకు పైనే వెళ్తున్న అతడిని సాగర్ రింగు రోడ్డు వద్ద ఎల్‌బీనగర్ డిటెక్టివ్ సబ్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ బృందం అదుపులోకి తీసుకుని విచారించారు. ఇండ్ల వద్ద పార్కు చేసిన బైకులను అతడు తన వద్ద ఉన్న మాస్టర్ కీ తో హ్యాండిల్ లాక్ తీసి దొంగిలించే వా డు. ఎవరికీ అనుమానం రాకుండా దొంగిలించిన బైకులను ఎల్‌బీనగర్ మెట్రో ఫ్రీ పార్కింగ్ స్థలంలో దాచేవాడు. డిసెంబర్ 2024 నుంచి ఇప్పటి వరకు అతడిపై 10 కేసులు నమోదయ్యాయి. ఎల్‌బీనగర్ పీఎస్‌లో, వనస్థలిపురం, సరూర్‌నగర్, మీర్‌పేట్, మలక్‌పేట్, అంబర్‌పేట్ పీ ఎస్‌లో బైక్ చోరీలు చేసినట్లు విచారణలో తేలింది. నేరాలు అంగీకరించడంతో అ తడి వద్ద 10 బైకులను స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు.

దర్గాకు వచ్చిన వ్యక్తి అదృశ్యం

వనస్థలిపురం : దర్గా వద్దకు వచ్చిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వనస్థలిపురం ప్రాంతానికి చెందిన షేక్ మస్తాన్(50) భార్య సబీరాతో కలిసి ఈనెల 7న చింతలకుంట దర్గాకు వచ్చారు. దర్గా వద్ద ఉండగా నిమిషాల్లో వస్తానని చెప్పి ఫోన్ కాల్ మాట్లాడుకుంటూ మస్తాన్ తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఎలాంటి ఆచూకీ లభ్యం కాకపోవడంతో సబీరాబేగం సోమవారం వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు,